క్లుప్తంగా

సాయిబాబాకు పల్లకీ సేవ



వైరా పట్టణ వీధుల్లో బాబా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న మాలధారులు

వైరా: వైరా మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలో గల సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడకల్లో భాగంగా ఆదివారం సాయి బాబాకు పల్లకీ సేవ నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని పట్టణం లోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామికి అభిషేకాలు, తులసిపూజ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

భాగ్యనగర్‌లో బోనాల సందడి



బోనాలతో వస్తున్న మహిళలు

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామంలో బోనాల వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ప్రదర్శనగా గ్రామ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి వద్దకు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.

మున్నూరు కాపులకు ప్రాధాన్యత కల్పించాలి



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఏన్కూరు: తెలంగాణ ప్రభుత్వంలో మున్నూరుకాపులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని మున్నూరుకాపు మండల అధ్యక్షుడు కొవ్వూరు నాగేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక ఠాగూర్ కల్యాణ మండపంలో నిర్వహించిన మున్నూరుకాపు మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మంత్రివర్గంలో మున్నూరుకాపులకు ఒక్క మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. అనంతరం మున్నూరుకాపు నూతన సంఘం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొవ్వూరు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గిద్దగిరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆది నర్సింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తుపల్లి: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యాన సత్తుపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో పలు వార్డులలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయ్, జిల్లా కార్యదర్శి సుదర్శన్‌మిశ్రా, నరేష్, నాగస్వామి, ప్రసాద్, శివ, అశోక్, శేషగిరి పాల్గొన్నారు.

బాబూజగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

సత్తుపల్లిటౌన్: భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని సత్తుపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, పలువురు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, చల్లగుళ్ల నర్సింహారావు, ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

సత్తుపల్లిరూరల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహాలను సత్తుపల్లిలో ఏర్పాటు చేయనున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని సంఘాలు సమిష్టిగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆ మహనీయుల విగ్రహాలను అన్ని వర్గాల ప్రజలను సమీకరించి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బి.మధుసూదన్‌రాజు, జి.రామకృష్ణ, టి.నాగాచారి, నాగేంద్రాచారి, సత్యనాయణ, చారి, శ్రీనివాసరావు, ప్రసాద్, భరత్ పాల్గొన్నారు.



టేకుపల్లి మోడల్ స్కూల్



విద్యార్థులను చేర్పిస్తున్న తల్లిదండ్రులు

రోల్ 'మోడల్'గా పాఠశాల

ఫలితాల్లో రికార్డు సృష్టిస్తున్న టేకులపల్లి మోడల్ స్కూల్

పెనుబల్లి: మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్ ఉత్తమ ఫలితాల సాధనలో రోల్ మోడల్‌గా నిలుస్తుంది. ఇప్పటికే వందశాతం సీట్లు నిండిపోయి పాఠశాల ముందు నో వేకెన్సీ బోర్డు పెట్టారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లీష్‌లోనే విద్యా బోధన చేస్తున్నారు. పాఠశాలలో 26 మంది ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేస్తూ.. పాఠశాలలో 450 మంది, కళాశాలలో 200 మంది మొత్తంగా 650 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 100మంది ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఉచిత హాస్టల్ సౌకర్యం ఈ పాఠశాల ప్రత్యేకత.

జిల్లా స్థాయిలో స్థానం..

గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో ఈ పాఠశాలకు చెందిన శీలం జయశ్రీ 575 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. 15మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 96శాతం, ద్వితీయ సంవత్సరం 93శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కళాశాలల విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది.

ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు..

తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి టేకులపల్లి మోడల్ స్కూల్‌లో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక్కడ విద్యార్థులు మానసిక ఉల్లాసానికి విశాలమైన పచ్చని వాతావరణంతో పాటు చదువు కోసం లైబ్రరీ, అటల్ బిహారీ వాచ్‌పేయి ల్యాబ్స్, ఆట స్థలంతో ఆహ్లాదకర వాతావరణం కలిగి ఉంది.

సమస్యలతో సతమతం..

ఈ పాఠశాలలో కొన్ని సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు స్టేజీ లేకపోవడంతో రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 100మంది బాలికలకు మాత్రమే హాస్టల్ సౌకర్యం ఉడడంతో మిగిలిన విద్యార్థులు సమీపంలోని పెనుబల్లి, కల్లూరు వసతి గృహాల నుండి రాకపోకలు చేయాల్సి వస్తుంది. హాస్టల్ భవనాన్ని విస్తరించి, అందరికీ వసతి కల్పించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు కల్పించుకొని ఈ పాఠశాలకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం..



ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అవసరమైన నీట్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డు ఎంసెట్ పరీక్షలకు సిద్ధం అయ్యేలా ప్రతి రోజు ఒకపూట విద్యార్థులకు బోధన చేస్తున్నాం. విద్యార్థులకు పోటీ పరీక్షలకు స్టడీ మెటీరియల్ అందించేందుకు దాతలు సహకరిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

– రూపస్, టేకులపల్లి మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్

ఈ పూజారి మాకొద్దు..



శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం

కల్లూరురూరల్: మండలంలోని లక్ష్మీపురం(రాళ్లబంజరు) గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న బైరవభట్ల నర్సింహారావును వెంటనే తొలగించాలని కోరుతూ గ్రామ భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. గత 20ఏళ్లుగా ఈ ఆలయంలో పనిచేస్తున్న ఆయన ఆలయానికి సక్రమంగా రావడం లేదన్నారు. ఇదివరకు గ్రామస్తులమంతా చందాలు వేసుకుని మరీ పూజారికి రూ.12వేలు అందించామని, గత రేండేళ్లుగా దేవాదాయశాఖ నుంచి రూ.10,500 వేతనంగా వస్తుందన్నారు. ఇవి సరిపోవడం లేదంటే మరో 5వేలు చందాలు వేసుకుని ఇస్తున్నామన్నారు. అతను ఈ ఆలయంతో పాటు మరో రెండు ఆలయాల్లో పూజలు చేస్తూ.. తమ గ్రామానికి సక్రమంగా రావడం లేదన్నారు. ఈ విషయమై గత నెలలో దేవాదాయశాఖ అధికారులు విచారణ జరిపి మందిలించారని, అయినా తీరు మారడంలేదన్నారు. తక్షణమే దేవాదాయ శాఖ అధికారులు లక్ష్మీపురం శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి పూర్తి కాలపు పూజారిని నియమించాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.

పామాయిల్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న పామాయిల్ రైతులు

బోనకల్: బోనకల్ మండల కేంద్రంలో పామాయిల్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పామాయిల్ రైతులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైతులు చావా వెంకటేశ్వరావు, పిచ్చయ్య, ఉమ్మినేని శ్రీనివాసరావులు మాట్లాడారు. తమ తోటల్లో గెలలు దిగుబడికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వైరా కేంద్రంగా ఏర్పాటు చేసిన పామాయిల్ కొనుగోలు కేంద్రంలో.. ప్రభుత్వం టన్ను రూ.18,740 ప్రకటించి, రూ.17,462 లకే కొనుగోలు చేస్తున్నారని, కొంతమంది రూ.16వేలకే కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తమ ఖాతాలో మాత్రం 10,400మాత్రమే పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ కేంద్రాల్లోనే మోసం జరిగితే మేం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పామాయిల్ రైతులు మాదినేని వీరభద్రం, పుల్లారావు, రత్నాకర్, రామారావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్

కొణిజర్ల: ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కొణిజర్ల సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఏకపక్ష నిర్ణయాలను ఏకతాటిగా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో రమేష్, కృష్ణ, కుటుంబరావు, సీతారాములు, సోమయ్య, కిరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, కుమారస్వామి, కృష్ణ, లక్ష్మణ్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

కార్మికసంఘం ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు..

బోనకల్: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ.. ప్రజా సంఘాలు వివిధ వ్యాపార సంస్థల్లోని కార్మికులందరికీ సమ్మె నోటీస్ అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వీరబాబు, ప్రజాసంఘాల నాయకులు సురేష్, శ్రీనివాసరావు, సునీత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

కల్లూరురూరల్: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేవరపల్లి మంగపతి ఇటీవల మోకాలికి చికిత్స జరిగినందున ఆయనను, కిడ్నీశస్త్ర చికిత్స జరిగిన బీరవెల్లి ప్రభాకర్ లను కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పరామర్శించారు. అదే విధంగా ఏపూరి మంజూరయ్య, దేవరపల్లి పరమేశ్వర్, కొర్లగూడెంలో బీరెల్లి లక్ష్మారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్‌భాగం నీరజాదేవి, నరేంద్ర, కాంగ్రెస్ నాయకులు సత్యబాబు, ప్రభాకర్ చౌదరి, నర్సింహారావు పాల్గొన్నారు.

జూనోసిస్‌డే వేడుకలు

సత్తుపల్లిటౌన్: ప్రపంచ జూనోసిస్ డే వేడుకల సందర్భంగా స్థానిక ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో ఆదివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన వీధి, పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ కె.ప్రదీప్‌కుమార్, మండల పశువైద్యాధికారి సీహెచ్ శశిదీప్, జూనియర్ వెటర్నరీ అధికారి కిరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యుక్త వయస్సులోనే దీర్ఘకాలిక వ్యాధులు

బోనకల్: యుక్తవస్సులోనే నూటికి 20మందికి బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయని ప్రముఖ వైద్యుడు టి.పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. శిబిరంలో 100 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఆనందరావు, పవన్, పూర్ణచంద్, కృష్ణయ్య, క్యాంప్ నిర్వాహకులు గిరి, చరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులకు మరమ్మతులు

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధం గ్రామ పంచాయతీలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరు వృథాగా పోతుంది. పలుచోట్ల రహదారులపై నీరు నిలిచి ఉండటంతో కొన్ని చోట్ల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఈ విషయమై గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులకు కొంత కాలంగా ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మేరకు మిషన్ భగీరథ అధికారులు ఆదివారం రోడ్డును తవ్వించి పైపులు లీకైన ప్రాంతాన్ని గుర్తించారు. యుద్ధ ప్రాతిపదికన పైపులైన్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించారు.


వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైరా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మీ నర్సయ్య 5వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకోని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెనుగొండ ఉపేంద్రరావు, శ్రీనివాసరావు, శరణ్, రాము, కృష్ణాకుమారి, రాజారావు, కృష్ణారావు, జనార్ధన్ తదితరులున్నారు.

గుంతలతో ప్రమాదమే..




కల్లూరు మధిర రోడ్‌లో ప్రమాదకరంగా మారిన పెద్ద గుంత

కల్లూరు: కల్లూరు పట్టణంలోని మధిర రోడ్‌లో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, లారీలు, బస్సులు వందలాది సంఖ్యలో తిరిగే ఈ రోడ్‌లో గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొందరు కిందపడి గాయాల పాలవుతున్నారు. గుంతలలో వర్షపు నీరు చేరుకుని ఇబ్బందిగా ఉంది. రాత్రి పూట మరీ ప్రమాదకరంగా ఉంది. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

అడుగడుగునా గుంత..



ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి ఇలా..



ముదిగొండ - సువర్ణాపురం ప్రధాన రహదారిలో ..

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఆర్అండ్‌బీ రోడ్డు, ముదిగొండ – సువర్ణాపురం ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా సమస్య మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కారం కావడంలేదు. ఇకనైనా అధికారులు గుంతల పడ్డ రహదారులపై మరం తోలించి, బ్లీచింగ్ చల్లించాలని, మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా తొలిఏకాదశి వేడుకలు

మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆదివారం తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల అర్చకులు తొలి ఏకాదశి ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. మొక్కులు సమర్పించుకుని కానుకలు హుండీల్లో వేశారు. పేలాలపిండిని పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏన్కూరు: గార్లఒడ్డు శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాయలంలో పూజలు చేస్తున్న భక్తులు



చింతకాని: నాగులవంచ సీతారామచంద్ర స్వామి ఆలయంలో..



ఎర్రుపాలెం: జమలాపురం ఆలయంలో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకులు



తల్లాడ: హనుమత్ పద్మావతి దేవాలయంలో..



సత్తుపల్లిటౌన్: గీతాపారాయణంలో పాల్గొన్న భక్తులు



పెనుబల్లి: నీలాద్రీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

పేదల కోసమే కమ్యూనిస్టు ఉద్యమాలు



కల్లూరు: మాట్లాడుతున్న నరసింహారావు

కల్లూరు/తల్లాడ: పేదలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి.. కార్మికుల, కర్షకుల డిమాండ్ల హక్కుల సాధనకోసం కమ్యూనిస్టులు పోరాటాలు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం కల్లూరులోని సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు అధ్యక్షతన, తల్లాడ యూనివర్సల్ విద్యాలయంలో నల్లమోతు నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా సీపీఐ జెండా ఆవిష్కరించారు. 100 సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. సీపీఐ నిరంతం బడుగు బలహీన వర్గాల వారి కోసం పని చేస్తుందన్నారు. అదే విధంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని మోదీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ, కార్మిక వ్యతిరేఖ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శివరామకృష్ణ, ఆదినారాయణ, రాంబాబు, దయాకర్, సత్యవతి, వెంకటేశ్వర్లు, రంజిత్‌కుమార్, శ్రావణ్‌కుమార్, రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉంచాలి



వైరా: మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా/కారేపల్లి: రైతులకు అవసరమైన యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా యూరియా ఉత్పత్తి తగ్గించి సరఫరాలో కోత పెట్టిందన్నారు. సాగర్ ఆయకట్టు, వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలన్నారు. అదే విధంగా కారేపల్లి మండలంలోని గాంధీనగర్‌లో.. ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన మండల కార్యదర్శి నరేంద్ర నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చలపతిరావు, రామారావు, సాంబశివరావు, సీతారామయ్య, శ్రీనాద్, మధు, రవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల: తనికెళ్లలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు



ఎర్రుపాలెంలో..

మొహర్రం వేడుకలు

మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు ఆదివారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్యాగధనులైన ప్రవక్తలను స్మరించుకున్నారు. గ్రామాల్లోని వీధుల్లో సాంప్రదాయబద్ధంగా పీరీలను ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్

బస్సు సౌకర్యం కల్పించాలి

ఖమ్మం - గుంటూరు బస్సు పునరుద్ధరించాలి

- గతంలో నడిపి రద్దు చేసిన రవాణా శాఖ
- ఇబ్బందులు పడుతున్న రైతులు, వ్యాపారస్తులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ముదిగొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని రూట్లకు ప్రజల సౌలభ్యం కోసం రవాణా సౌకర్యం కల్పించారు. దూర ప్రాంత ప్రజలకు, వ్యాపారస్తులకు, వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఖమ్మం నుంచి గుంటూరు బస్ సర్వీస్‌ను ప్రతి రోజు సమయ పాలనతో నడిపిన సర్వీసును రాష్ట్రాల పున:విభజన అనంతరం బస్సు సర్వీసు రద్దు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు, పాలకులు పట్టించుకోలేదు.

ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రజలు..

దీంతో ప్రజలు ఇతర ఆటోలు ఇతర వాహనాలపై ఆధారపడాల్సి వస్తుంది. బస్సు సర్వీస్ రద్దు చేసినప్పటి నుంచి ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముదిగొండ మండల ప్రజలకు ఏపీ రాష్ట్రం విజయవాడ, గుంటూరు కాస్త దగ్గరగా ఉండడంతో ఎక్కువ శాతం రవాణా సాగించేవారు. ఇక్కడ ప్రజలు ఆస్పత్రి, వ్యవసాయ పనిముట్ల, ఇతర వ్యాపార పరమైన పనులకు ఖమ్మం వెళ్లి రావాలంటే దూరం కావడంతో పాటు ఎక్కువ సమయం పడుతుంది. కావున గతంలో లాగానే ఖమ్మం నుంచి వల్లబీ మీదుగా విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ముదిగొండ మండల ప్రజలు, రైతులు, వాపారస్తులు కోరుతున్నారు.

ప్రతి అవసరానికి గుంటూరు వెళ్తాం..



గుంటూరులో నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు ఎక్కువగా ఉంటాయి. దీంతో పాటు ధర కూడా అనుకూలంగా ఉంటుంది. నేను చాలా సార్లు బైక్‌పై జగ్గయ్యపేట వరకు వెళ్లి అక్కడి నుంచి గుంటూరు బస్సుకి వెళ్లేవాడిని. లేదంటే ఖమ్మం వెళ్లి రైలుకి వెళ్లాలి. గతంలో లాగా బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుండు.

– వల్లబి రవికిరణ్, యువ రైతు, అమ్మపేట

పరిశీలించి పునరుద్ధరిస్తాం..



ఖమ్మం - గుంటూరు బస్సు విషయంలో ఒకసారి రూట్ పరిశీలన చేసి తెలుసుకుంటాం. తదుపరి దానిపై అవగాహనకు వచ్చి అధికారులతో మాట్లాడి పరిశీలించి, బస్సు సౌకరంపై ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– దినేష్, ఖమ్మం ఆర్టీసీ బస్ డిపో మేనేజర్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా వి. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎన్. జయరాజు - 96528 68642